ప్రజాశక్తి
బుధవారం 3 మే 2023
5
శ్రీకాకుళం
మరిన్ని వార్తల కోసం
www.prajasakti.com
epaper.prajasakti.com

శివారుకు సాగునీరందేనా..?

- 'వంశధార'లో గుర్రపుడెక్కే అసలు సమస్య
- ప్రభుత్వం పైసా ఇవ్వని ఇవ్వని పరిస్థితి
- జిల్లా నిల్వల నుంచి గతేడాది రూ.60 లక్షలు కేటాయింపు
- ఈ ఏడాది నిధుల కోసం ఎదురుచూస్తున్న అధికారులు

వంశధార కుడి, ఎడమ కాలువల ద్వారా ఈసారి శివారు భూములకు సాగనీరందడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రెండు కాలువల్లోనూ విపరీతంగా గుర్రపుడెక్క పేరుకుపోయింది. దాన్ని పూర్తిగా తొలగిస్తే గానీ నీరు స్వేచ్ఛగా పారే అవకాశం లేదు. గుర్రపుడెక్క పూడికతీత పనులకు ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ రూ.60 లక్షలను కేటాయించారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు ఈ అంశంపై ఎటువంటి నిర్ణయమూ వెలువడలేదు. వేసవి సీజన్‌లో ఇప్పటికే రెండు నెలలు గడచిపోయాయి. జూన్‌లో వర్షాలు పడే అవకాశం ఉండడంతో పనులు చేసే వీల్లేదు. గుర్రపుడెక్క తొలగింపుపై నిధులు కేటాయించాలంటూ వంశధార ఇంజినీరింగ్ అధికారులు రెండు పర్యాయాలు వ్యవసాయ సలహా మండలిలో ప్రస్తావించారు. కలెక్టర్ నిర్ణయం కోసం అంతా ఎదురుచూస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందించాల్సి ఉంది. కాలువల పరిస్థితి దయనీయంగా ఉండడంతో నిర్దేశించిన ఆయకట్టుకు నీరందడం లేదు. ముఖ్యంగా శివారు భూములకు నీరందని పరిస్థితి ఏటా పునరావృతమవుతోంది. సాగునీటి కాలువలు చాలా బలహీనంగా ఉండడం, కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెక్కులు కాగా కాలువ గట్లు బలహీనంగా ఉండడంతో 1800 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా 500 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది.

సరుబుజ్జిలి మండలం శ్యామలాపురం సమీపంలో వంశధార కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

సాగునీటిపై ప్రభావం

పంట కాలువల్లో ఈ ఏడాది పూడికతీత పనులు చేపట్టకపోతే శివారు భూములకు నీరందించే పరిస్థితి కనిపించడం లేదు. పంట కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోయింది. ఖరీఫ్‌లో ఎడమ కాలువ పరిధిలోని పోలాకి, నరసన్నపేట, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని చాలా గ్రామాలకు సాగునీరందలేదు. కుడి కాలువ పరిధిలోని గార మండలంలో పంటలు ఎండిపోయిన పరిస్థితులు తలెత్తాయి. గత ఖరీఫ్ సీజన్‌లో కీలకమైన పొట్ట దశలో పలాస, టెక్కలి నియోజకవర్గాలోని సుమారు 20 వేల ఎకరాలకు నీరందలేదు.

గతేడాది నాసిరకంగా పనులు

వంశధార కాలువల్లో గతేడాది చేపట్టిన గుర్రపుడెక్క, పూడికతీత పనులు నాసిరకంగా ఉన్నాయన్న విమర్శలు వచ్చాయి. గుర్రపుడెక్క తొలగింపునకు కేటాయించిన రూ.60 లక్షలతో 67 రకాల పనులను చేపట్టారు. పనులు విలువ చాలా తక్కువ వ్యయం కావడంతో నామినేషన్ పద్ధతిపై గ్రామాల్లోని వైసిపి నాయకులకు అప్పగించారు. సెప్టెంబరులో వర్షాలు పడుతున్న సమయంలో పనులు చేపట్టి అక్టోబరులో పూర్తి చేశారు. దీంతో ఖరీఫ్ సీజన్‌లో శివారు భూములకు సాగునీరందలేదు. ఈ ఏడాదైనా ఖరీఫ్‌కు నీరు విడిచిపెట్టే సమయానికి పనులు చేపడితే, కొంతమేరకైనా పనులు నాణ్యంగా చేపట్టే అవకాశం ఉంది.

నిధులు మంజూరైతే పనులు చేపడతాం

వంశధార కుడి, ఎడమ కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడికతీతతో సాగునీటి ప్రవాహానికి ఇబ్బందిగా మారింది. రబీలో నీటిని విడిచిపెట్టడంతో గుర్రపుడెక్క ఆకు ఉధృతంగా పెరిగింది. గుర్రపుడెక్క తొలగింపునకు ఈసారి అదనంగా నిధులు అవసరమవుతాయి. వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఈ అంశంపై రెండు పర్యాయాలు ప్రస్తావించాం. నిధులు మంజూరైతే పనులు చేపడతాం.

- దోల తిరుమలరావు,
ఎస్ఇ, వంశధార ప్రాజెక్టు సర్కిల్

నిరవధిక దీక్ష చేస్తున్న ఆదివాసీలు

బోయ వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చొద్దు

- గిరిజన ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి
- ఆదివాసీల 48 గంటల నిరవధిక దీక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ శాసనసభలో చేసిన తీర్మానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి డిమాండ్ చేశారు. బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ సమీపాన జ్యోతిరావు పూలే పార్కు వద్ద చేపట్టిన 48 గంటల నిరవధిక దీక్షను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయ వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల గిరిజనులకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. రాష్ట్రంలోని ఆదివాసీలంతా ఏకమై చలో ఢిల్లీ కార్యక్రమానికి తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోకుంటే ఆదివాసీ రిజర్వేషన్లపై పోటీ చేసి గెలుపొందిన ఏడుగురు ఎమ్మెల్యేలు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చరాదని 90 రోజులుగా ఆదివాసీలంతా ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అధికారంలోకొస్తే గిరిజనులకు న్యాయం చేస్తానన్న జగన్, ఒక్క తీర్మానంతో ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. మెళియాపుట్టి కేంద్రంగా ఐటిడిఎను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సుమారు వెయ్యి మందికి పైగా నకిలీ ఎస్‌టి ధ్రువపత్రాలతో పలు ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిఒ నంబరు 3ను ఏజెన్సీలో అమలు చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షా శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి సందర్శించి పోరాటానికి సంఘీభావం తెలిపారు. దీక్షలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు బైదలాపురం సింహాచలం, గురాడి అప్పన్న, డి.శ్రీను, చింతపల్లి భాస్కరరావు, జి.లక్ష్మణరావు, డి.జమ్మయ్య తదితరులు కూర్చొన్నారు.

మా భూములు లాక్కోవద్దు

సబ్ కలెక్టర్ వద్ద రైతుల ఆవేదన

ప్రజాశక్తి - టెక్కలి

ఏడాదికి రెండు పంటలు పండిస్తూ జీవనాధారంగా ఉన్న భూములను అభివృద్ధి పేరుతో లాక్కోవద్దని మండలంలోని బన్నువాడ, మోదుగువలసకు చెందిన రైతులు సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డిని కోరారు. మూలపేట పోర్టు రహదారికి భూసేకరణపై సబ్ కలెక్టర్ కార్యాలయంలో రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తమ భూముల మీదుగా రోడ్డు వేస్తే జీవనాధారాలు పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి ప్రయోజనాల కోసం తమ భూములను సేకరిస్తున్నారని ప్రశ్నించారు. రోడ్డు నిర్మాణం వల్ల మదనగోపాలసాగరం, పోతచెరువు, దాలిచెరువుల నుంచి వచ్చే నీటి ప్రవాహం వల్ల తమ గ్రామాలతో పాటు వేములాడ, పితాపురం, శ్రీరంగం గ్రామాలకూ ముంపు ప్రమాదం పొంచి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణం వల్ల కలిగే నష్టాలపై విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మోదుగువలస గణపతిరావు బోర్డు మీద రాసి సబ్ కలెక్టర్‌కు వివరించారు. తమ ఆందోళనలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా రోడ్డు నిర్మాణం చేయాలనుకుంటే మూలపేట గ్రామాన్ని తరలించే విధంగా తమనూ తరలించాలన్నారు. దీనిపై సబ్ కలెక్టర్ స్పందిస్తూ రైతులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను కలెక్టర్‌కు నివేదిస్తానన్నారు. సమావేశంలో రైతులు వి.రామకృష్ణ, సనపల మురళి, జానకిరామయ్య, పోలాకి ఆనందరావు, నంబూరు షణ్ముఖరావు, పోలాకి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను బోర్డుపై రాసి సబ్ కలెక్టర్‌కు వివరిస్తున్న గణపతిరావు

కాంగ్రెస్‌కు పీరుకట్ల రాజీనామా

ప్రజాశక్తి - బూర్జ

పిసిసి ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మండలంలోని రాజపురంలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల అభీష్టం మేరకే రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. రాజీనామా లేఖను పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజుకు పంపించినట్లు చెప్పారు. మాజీ వైస్ ఎంపిపి పీరుకట్ల ప్రభాకరరావు కూడా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజీనామా పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బి.సత్యవతికి అందజేసినట్లు తెలిపారు. ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలను తీసుకుని ఏ పార్టీలో చేరాలో త్వరలో నిర్ణయం తీసుకుంటానన్నారు. సమావేశంలో పీరుకట్ల సీతబాబు మామిడి వెంకట సూర్యం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్

విచారణ చేస్తున్న ఎంపిడిఒ ఉమాసుందరి

'ఉపాధి' అక్రమాలపై విచారణ

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీలో ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై 'ఫీల్డ్ అసిస్టెంట్‌కే ఉపాధి' శీర్షికన ప్రజాశక్తి కథనంపై అధికారులు స్పందించారు. నౌపడ సచివాలయంలో ఎంపిడిఒ ఉమాసుందరి ఎపిఒ వాసునాయుడుతో కలిసి ఫీల్డ్ అసిస్టెంట్ నీలాపు ప్రసాద్‌రెడ్డి, మరో ఫీల్డ్ అసిస్టెంట్ బి.రామారావును మంగళవారం విచారణ చేశారు. ఎంపిడిఒ అడిగిన ప్రశ్నలకు బదులు చెప్పకుండా తమను కావాలనే ఇరికిస్తున్నారా అని ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు తీవ్ర అసహనంతో ఊగిపోయారు. ఇలాంటి ఉద్యోగం చేసుకుని ప్రతిఒక్కరికీ ప్రాధేయపడాల్సిన అవసరం లేదనడంతో విచారణకు వచ్చిన అధికారులు షాక్ అయ్యారు. సచివాలయ సిబ్బంది జోక్యం చేసుకోవడంతో చివరకు విచారణకు సిద్ధమయ్యారు. నెలకు రూ.12 వేలు జీతం తీసుకుని ఉపాధి పనిచేస్తున్నట్లు కూలి డబ్బులు ఎలా తీసుకుంటారని ఎంపిడిఒ ప్రశ్నించారు. ఉద్యోగస్తులకు, ఉపాధి పనికి రాని వారికి ఎలా మస్టర్లు వేస్తారని ప్రశ్నించినా వారి నుంచి సమాధానం రాలేదు. పలువురు పేర్లతో మస్టర్లు వేసి వాటాలు తీసుకుంటున్నారా అని అడిగిన ప్రశ్నలకు మౌనం దాల్చారు. దీంతో వారి నుంచి లిఖితపూర్వకంగా వివరణ తీసుకున్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేసి, తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ తెలిపారు.

జాబుకార్డుదారులకు వంద రోజుల 'ఉపాధి'

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

జాబ్‌కార్డుదారులకు వంద రోజులు పని దినాలు కల్పించడమే లక్ష్యంగా పంచాయతీ, మండల స్థాయిలో పనులను గుర్తించినట్లు డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపాధి కూలీలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని రొట్టవలసలో చేపడుతున్న అమృత్ సరోవర్ చెరువు పనులు, ఎల్ఎన్ పేట మండలం సిద్ధాంతంలో చేపడుతున్న పెద్ద కోనేరు చెరువు అభివృద్ధి పనులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. గట్టును వెడల్పు చేయడం, బెంచింగ్ పనులు చేయడంతో పాటు పార్కును తలపించే ఆహ్లాదకరమైన వాతావరణాన్ని గ్రామస్తులకు అందించాలని సూచించారు. ఉపాధి కూలీల సగటు కూలి పెంపుపై సిబ్బంది దృష్టిసారించాలన్నారు. గరిష్ట కూలి అందేలా పనులు చేయించాలన్నారు. నాణ్యతతో కూడిన పనులు చేయడం వల్ల వాటి ఫలితాలు గ్రామీణ ప్రజలందరికీ అందుతాయన్నారు. శ్రమ శక్తికి జిల్లా చిరునామా వంటిదని, ఉపాధి హామీ అమల్లో జాతీయస్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు కూలీలు తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎపిడి పి.రాధ, ఎపిఒ పార్వతి, శ్రీదేవి, టెక్నికల్ అసిస్టెంట్ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లా కోర్టులోని జిల్లా జడ్జి ఛాంబరులో పోలీసు, ఎక్సైజ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో పెండింగ్ కేసుల పరిష్కారానికి పలు ప్రభుత్వ శాఖలు చొరవ చూపాలన్నారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో క్రిమినల్ కేసులు రాజీ చేసేందుకు న్యాయాధికారులు, న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసులు సహకరించాలన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ కావడం వల్ల కక్షిదారులకు ధనం, సమయం వృథా కావని, సత్వర న్యాయం లభిస్తుందన్నారు. కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ శారదాంబ, ఎక్సైజ్ మెజిస్ట్రేట్ భరణి, ఎఎస్‌సి టి.పి విఠలేశ్వరరావు, ట్రాఫిక్ డిఎస్‌పి ప్రసాదరావు, అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ గోపాల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లేశ్వరరావు, కృష్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నేను అనగా మూకళ్ల సింహాద్రి నాయుడు 1వ వార్డు , బలగ, చిట్టివీది,శ్రీకాకుళం. మా ఇంటి నుండి పాలకొండ సూర్యావతి W/o లేటు సూర్యానారాయణ గారికి సంబందించిన ఇల్లు డాక్యుమెంట్‌ను నా వద్ద తనఖా పెట్టియున్నారు. వీటిని జిరాక్స్ తీయ్యు నిమిత్తము రిమ్స్ హాస్పటిల్ జంక్షన్ వద్ద ఉన్న జిరాక్స్ షాప్ దగ్గర జిరాక్స్ కాపీలు తీసుకొని ఇంటికి వస్తుండగా తేది 26-04-2023 సుమరు గం॥ 8.30 నుండి 09.00 గం॥ల మద్య నా ద్విచక్ర వాహనానికి సైడ్ యాంగిల్స్‌కి పెట్టినాను. సంచితో సహా ఒరిజినల్ డాక్యుమెంట్ పాయినవి. డాక్యుమెంట్ నెం.924/1984 ఈ డాక్యుమెంట్ ఎవరికైన దొరికినట్లుయితే ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు తెలియజేయగలరు.

9951052040

కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో వామపక్ష నాయకులు

ప్రభుత్వ నిర్బంధం

- విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై నేడు రాస్తారోకోలు
- వామపక్ష, కార్మిక, ప్రజాసంఘాల నాయకులకు నోటీసులు, ముందస్తు అరెస్టులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం, పలాస

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ కమిటీ పిలుపు మేరకు ఈనెల మూడో తేదీన చేపడుతున్న రాష్ట్రవ్యాప్త రాస్తారోకోలపై ప్రభుత్వం నిర్బంధం విధిస్తోంది. వామపక్ష నాయకులు, ప్రజా, కార్మిక సంఘాల నాయకుల ఇళ్లకు వెళ్లి రాస్తారోకోలో పాల్గొవద్దని పోలీసులతో మంగళవారం నోటీసులు అందజేయించింది. నిరసన కార్యక్రమం వల్ల శాంతిభద్రతలకు విఘాతం, ప్రభుత్వ, ప్రజల ఆస్తులకు నష్టం కలిగించే అవకాశముందని, నేరం చేయడానికి అవకాశమున్నందున నిరసనలో పాల్గొనవద్దని సెక్షన్ 149 సిఆర్‌పిఎస్ ప్రకారం నోటీసులు ఇచ్చింది. పలాసలో వామపక్ష నాయకులను ముందస్తు అరెస్టు చేసి కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులను సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు తీవ్రంగా ఖండించారు. ముందస్తు అరెస్టులు అంటే స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు ప్రభుత్వం సహకరిస్తున్నట్టా అని ప్రశ్నించారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద బుధవారం ఉదయం పది గంటలకు రాస్తారోకో నిర్వహించనున్నట్లు విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. జిల్లాలోని అన్ని కార్మిక, ప్రజాసంఘాలు, పార్టీలు, కార్మికులు, ప్రజలు పాల్గొని రాస్తారోకో జయప్రదం చేయాలని కోరింది.

బహిరంగ ప్రకటన

THE SUIT OS NO 37/2021 FILED BEFORE THE HONOURABLE COURT OF THE 1ST ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM BY THE PLAINTIFFS AGAINST THE DEFENDANTS FOR PARTITION THE PROPERTIES MENTIONED IN THE SCHEDULE

Between:

1. Chigurupalli Jhansi Rani W/O Late Venkata Surya Kumar, Hindu, Age 49 Year, House Hold Duties, resident of H.No.7-3-6/1, Nagavali Quarters, Konna Veedhi, Srikakulam Town and District, Andhra Pradesh State -Pin532 001 Aadhaar No.9065 1015 1974

2. Chigurupalli Malvica D/O Late Venkata Surya Kumar and Wife of Vamsee Mohan Pydi, Hindu, Age 28 Year, Occ. Un-employee, resident of -rest do- Aadhr No.4354 4400 6533. -Plaintiffs

And:

1. Chigurupalli Rajya Lakshmi W/O Late Venkata Surya Kumar, Hindu, House Hold Duties, Age 43 Year, presently residing at Lawsons Bay Colony, LB Colony, GVMC (PART), Visakhapatnam, Andhra Pradesh (State) Pin-530017 and Nativity of Dusi Village, Amadalavalasa. Mandalam, Srikakulam District, Andhra Pradesh (State).

2. Chigurupalli Pravalika, D/O Late Venkata Surya Kumar, Hindu, Age 16 Year, resident of -rest do-

3. Chigurupalli Vamsi Krishna Murthy S/O Late Venkata Surya Kumar, Hindu, Age 15 Year, resident of rest do.

(The Respondents No.2 and 3 being minors, represented by the next friend guardian the mother i.e., the 1st Respondent. **-Defendants**

శ్రీకాకుళం ఫస్ట్ ఎడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో ఒయస్ నెం.37/2021 ఇందులో వాదులు మరియు ప్రతివాదుల మధ్య ఇందులో షెడ్యూల్లో వివరించిన ఆస్తుల పంపకంలో తగాదాలు ఉభయపార్టీల వారి మధ్య ఉన్నందున వారికి రావాలసిన న్యాయపరమైన వాటాల నిమిత్తము ఇందులో వాదులు పార్టీషన్ షూట్ దాఖలు చేసి ఉన్నారు. కావున ఇందులో షెడ్యూల్లో వివరించిన ఆస్తులను ప్రతివాదులు అమ్మజూపిటకు ప్రయత్నం చేస్తున్నందున సదర్ ఆస్తులను ఎవరు కూడా కొనరాదని ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియచేయుచున్నాము. ఒకవేళ ఎవరైనా ఇందులో వివరించిన షెడ్యూల్ ఆస్తులు పైన ఏవిదమైన లావాదేవీలు జరిపించిన ఎడల ఇందులో ప్రతివాదులకు ఎట్టి సంబంధము లేదనియు సదరు కోర్టులో ఉన్న కేసు పూర్తి పరిష్కారం అయినంత వరకు వివిధమైన లావాదేవీలు చేయరాదని ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

PLAINT A- SCHEDULE: Landed properties situated in different villages mentioned as follows:

Item No.	Survey No.	Extent Ac. - Cents	Nature of The land	Boundaries of Land	Lands Situated At
1.	101-1	00-11	Wet	Full Extent	Dusi Village, madalavalasa Mandalam and S.R. Srikakulam Dt.
2.	101-6A	00-10	Wet	Full Extent	-Ditto -
3.	101-6B	00-10	Wet	Full Extent	-Ditto -
4.	107-14A	00-11	Wet	Full Extent	-Ditto -
5.	107-14B	00-12	Wet	Full Extent	-Ditto -
6.	148-1	00-09	Wet	Full Extent	-Ditto -
07	148-19	00-19	Wet	Full Extent	-Ditto -
08	148-20	00-10	Wet	Full Extent	-Ditto -
9.	148-2A	00-05	Wet	Full Extent	-Ditto -
10,	148-2B	00-06	Wet	Full Extent	-Ditto -
11	148-3A	00-03	Wet	Full Extent	-Ditto -
12	151-6	00-38	Wet	Full Extent	-Ditto -
13	154-17	00-36	Wet	Full Extent	-Ditto -
14	155-9A	00-46	Wet	Full Extent	-Ditto -
15	166-20	00-38	Wet	Full Extent	-Ditto -
16	168-6	00-27	Wet	Full Extent	-Ditto -
17	171-10	00-78	Wet	Full Extent	-Ditto -
18	172-2	01-32	Wet	Full Extent	-Ditto -
19	174-2	00-09	Wet	Full Extent	-Ditto -
0.20	176-3	00-13	Wet	Full Extent	-Ditto -
21	179-18	00-14	Wet	Full Extent	-Ditto -
22	68-2	00-23	Wet	Full Extent	-Ditto -
23	74-15	00-60	Wet	Full Extent	-Ditto -
24	79-29	00-05	Wet	Full Extent	-Ditto -
25	79-30	00-04	Wet	Full Extent	-Ditto -
26	91-7A	00-04	Wet	Full Extent	-Ditto -
27	211-7	00-08	Wet	Full Extent	Korlakota Village, Amadalavalasa Mandalam and S.R. Srikakulam Dt

PLAINT B-SCHEDULE: House properties situated in different areas mentioned as follows:

Item No	Description and situated of Property	Reg. date. Exe. date , Press Date	Boundaries of the Property
01.	G+2 R.C.C. Residential Building, Situated at Patha Srikakulam (Rural) Govt. College Road,Near Covent Road, W-B 1-6, S.No.710/1,710/2 And 203, Bearing House No.1-6-1, With extent of 331. 100Sq.Yd, .built Area 5783.4 Sp. Ft.(G+2)	09-11-2011 Gift Settle- ment deed.In the name Of father of Chaitanya Plot No.6 The 1" Plai-ntiff	East: Sampathirao Savitri Plot No.8 Site and Building South: Lay Out Road,West: Sadasivuni Thirumala, Chaitanya Plot No.6, North: Bulding of Numbala Rama
02.	G+1 R.C.C. Residential Building, Situated at Patha Srikakulam(Rural) Nehru Nagar Santhi Nagar, W-B 1-4, S.No.704, 705, 204, 205/1B Plot No.16, Bearing House No.1-4/6-11/3 With extent of 297.78Sq.Yd, built Area 1104 Sp. Ft.(G+2)	1 4 - 0 6 - 2004Sale deed In the name of father of the 1st plaintiff	East: Municipal Road, South: Plot No.23,K.Yekambes wara Rao House, West: Plot No. 15 Ch.Simhacalam,North: 33' Layout Road
03.	Residential Open plot i.e., the site Situated at Kattiraveedhi in Balaga Villag (Ward) Srikakulam Municipality and town and District An extent of Sq.Yd, being north part of the total extent of Ac.01-51 Cents in S. No.27(S.R.No.476 and baring New S.No.1880/31	In the Deed of partition of Dated 06-01-2011 in the name of the father of the 2nd plaintiff men- tioned in the B- Schedule	East: 34 1/2 Feet Municipal Corpora- tion Road, South: remaining part of site Ch.Ammannamma at present Compound wall Of SMV Apar tment, W Vacant site of Jamana Venkata Lakshmi. North: House of Putrevu Sudhakara Rao and others

కూన రాజారావు
వాదులుతరుపు న్యాయవాది,
శ్రీకాకుళం, ఫోన్ 9440028468

మాట్లాడుతున్న వైకుంఠరావు

వేసవి క్రీడా శిక్షణను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పలాస

మండలంలోని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొర్ల వైకుంఠరావు విద్యార్థులకు సూచించారు. పాఠశాల క్రీడా మైదానంలో నెల రోజులు అథ్లెటిక్స్ క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తామని అన్నారు. మూడు నుంచి తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులందరూ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు చెల్లూరి పద్మలోచనం శిక్షణలో ఉదయం, సాయంత్రం పాల్గొంటారని అన్నారు. ఆటల్లో మెలకువలతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెంపొందించుకోవాలని కోరారు. వ్యాయామ ఉపాధ్యాయ మొదటి జోన్ సెక్రెటరీ గజేంద్ర, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు చెల్లూరి పద్మలోచనం, ఎస్.వి.రమణారావు గ్రామ పెద్దలు జామి రామారావు పాల్గొన్నారు.

పురస్కారాన్ని అందుకుంటున్న కృష్ణమూర్తి

'తెప్పల'కు ఆదర్శ స్వర్ణ నంది పురస్కారం

పలాస : హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాయ గానసభ వేదికలో ఆదర్శ కళానిలయం ఆధ్వర్యాన జరిగిన ఆదర్శ ఐరావతం, ఆదర్శ స్వర్ణ నంది జాతీయ అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో పలాసకు చెందిన జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి ఆదర్శ స్వర్ణ నంది అవార్డుకు ఎంపికయ్యారు. రచయితగా, నటుడిగా, లయన్స్ సభ్యునిగా, సమాజ సేవకునిగా, విద్యావేత్తగా వివిధ రంగాల్లో విశిష్ట సేవ అందిస్తున్నందుకు ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు కృష్ణమూర్తి తెలిపారు. ఈ పురస్కారాన్ని ఆదర్శ కళానిలయం అధ్యక్షులు చీరాల ప్రకాష్, సినీ నటులు రాజేష్ కుమార్ కుమానం, జ్యోతిరెడ్డి, దైవజ్ఞ శర్మ, డాక్టర్ అరుణ సుబ్బారావు చేతుల మీదుగ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వివిధ అనుబంధ సేవా సంస్థల అధ్యక్షులు అప్పారావు, వెంకటాచలం, చిన్నచారి, రుద్రమూర్తి, ఉత్తరావల్లి నాగేశ్వరరావులు అభినందనలు తెలిపారు. త్యాగరాయ గానసభ వేదికపై పురస్కారం పొందడం, స్వర్ణనంది పురస్కారం లభించడం ఆనందంగా ఉందని కృష్ణమూర్తి అన్నారు.

నేడు ఎంపిడిఒ కార్యాలయం ప్రారంభం

పొందూరు: పొందూరు మండల పరిషత్ కార్యాలయం నూతన భవనాన్ని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం బుధవారం ప్రారంభించనున్నట్లు ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ హాజరవుతారని పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయ ఉద్యమ మార్గదర్శకులు రామిరెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయ ఉద్యమ మార్గదర్శకుడు, విద్యారంగా సంక్షేమానికి అలుపెరుగని పోరాటాలు చేసిన వ్యక్తి దాచూరి రామిరెడ్డి అని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్‌కుమార్ తెలిపారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో రామిరెడ్డి ఏడో వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ముందుగా రామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఏవైనా పోరాట పంథాను ఎంచుకొని పోరాటాల ద్వారానే ఫలితాలు సాధించుకోవచ్చని నిరూపించిన మహనీయుడు రామిరెడ్డి అని అన్నారు. ప్రభుత్వాల మెడలు వంచి తమకు రావాల్సిన హక్కులను సాధించుకోవాలని తెలిపిన స్ఫూర్తి ప్రదాత అని అన్నారు. నాటి ప్రభుత్వ నిరంకుశ విధానాలను ఎండగట్టి ఉపాధ్యాయులకు రీ గ్రూపింగ్ స్కేల్స్ ఇప్పించడంలో, ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కేల్ మంజూరు లోనూ ఎంతో శ్రమించారన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా నూతన విద్యా విధానం ప్రవేశపెట్టి ప్రాథమిక పాఠశాలలను మూత వేయడానికి సిద్ధంగా ఉన్నాయని అన్నారు. దీనివల్ల

శ్రీకాకుళం అర్బన్ : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు, ఆడపిల్లలు విద్యకు దూరమై సమాజంలో అసమానతలు ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. ఇలాంటి వాటిని ఎదుర్కోవడానికి ఆయన స్ఫూర్తితో ఉపాధ్యాయులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు.

డిఎల చెల్లింపులో వింత వైఖరి

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు డిఎ మంజూరు చేస్తూ దాన్ని మూడు నెలల తర్వాత జీతంతో కలిపి ఇస్తామనడం, ఎరియర్స్ మూడు విడతలు 2024 మార్చి వరకు చెల్లిస్తామని అన్నడం విడ్డూరంగా ఉందని అన్నారు. 2022 జనవరి డిఎను ఇన్ని విడతలుగా ఇస్తే... మరి 2022 జూలై, 2023 జనవరి, 2023 జూలై, 2024 జనవరి మొత్తం నాలుగు డిఎలను ప్రభుత్వం ఎప్పుడు మంజూరు చేస్తుందో కూడా తెలియజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బి.శ్రీరామ్మూర్తి, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.గిరిధర్, జిల్లా కార్యదర్శి హెచ్.అన్నాజీరావు, పి.సూర్యప్రకాశరావు, జి.సురేష్, జిల్లా నాయకులు ఎల్.కోదండరామయ్య, కె.వెంకటరావు, టి.రవి సారథి, జి.విశ్వనాథం, ఎ.వి.రమణ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

టెక్కలి : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి డి.రామిరెడ్డి ఎన్నో పోరాటాలు చేశారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని పోరాట పంథాని కొనసాగించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కురమాన దాలయ్య అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో రామిరెడ్డి వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ప్రస్తుత తరుణంలో ఆయన పోరాటాలను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పాలవలస ధర్మారావు, తమ్మినేని వైకుంఠరావు, డి.లక్ష్మీనారాయణ, పొట్నూరు జగదీష్, మారం కుమారస్వామి, రోణంకి విజయ్‌కుమార్, బమ్మిడి ఆరుణకుమార్ పాల్గొన్నారు.

అలరించిన మేడే సాంస్కృతిక ఉత్సవాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సిఐటియు, గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో మంగళవారం రెండో రోజున మేడే సాంస్కృతిక ఉత్సవాలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె.మూర్తి మాట్లాడుతూ ఆదిమకాలం నుంచి నేటి ఆధునిక యుగం వరకు జరిగిన సమాజ అభివృద్ధి అంతా మానవ శ్రమ ఫలితమేనని అన్నారు. శ్రమలో నుంచే వివిధ కళలు రూపుదిద్దుకున్నాయని, శ్రమకు కళలకు అవినాభావ సంబంధం ఉందని అన్నారు. కళ కళ కోసం కాదని, ప్రజల కోసమని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులచే నృత్యం, ఆముదాలవలసకు చెందిన శివ మిమిక్రీ ఆకట్టుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు గ్రహీత ముళ్లపూడి రామచంద్రరావు చేసిన 'దుర్యోధన-మయసభ' ఏకాపాత్రాభినయం ప్రేక్షకులను కట్టిపడేసింది. పూజారి

నృత్య ప్రదర్శన చేస్తున్న రామారావు బృందం

దివాకర్, ప్రొఫెసర్ కె.ఉదయకిరణ్‌ల కవితలు ఆలోచింపజేశాయి. చిలకపాలెంకు చెందిన రామారావు బృందం నాట్యప్రదర్శన, సునీత నాయకత్వాన శివసాయి నృత్యనికేతన్ సభ్యుల నృత్యాలు అలరించాయి. సిహెచ్. ఉమామహేశ్వరరావు మ్యాజిక షో ఆబాలగోపాలాన్ని అలరించింది. గాయత్రి స్వరాంజలి గాయకులు అభ్యుదయ, దేశభక్తి గీతాలు, చిన్నారి చైతన్య సాధన చేసిన డాన్సు సభికుల హర్షధ్వానాలు అమితంగా పొందాయి.

బాహుదా ఛానల్ పనులు వేగవంతం

ఎమ్మెల్సీ రామారావు

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం : మండలంలో చేపడుతున్న కేసుపురం బాహుదా ఛానల్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆదేశించారు. ఈ ప్రాంత రైతాంగం ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న బాహుదా ఛానల్ పనులకు ఎట్టకేలకు కలెక్టర్ డిఎంఎఫ్ నుంచి రూ.28 లక్షలు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించారు. ఈ పనులను ఇరిగేషన్ ఎస్ఇ పి.సుధాకర్, డిఇ ఎ.రమేష్‌తో కలిసి రామారావు మంగళవారం పరిశీలించారు. ఛానల్ పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపి సీడ్ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎఇ ఎం.ఎస్.పాణిగ్రహి, ఇప్పిలి కృష్ణారావు పాల్గొన్నారు.

6 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రయివేటు స్కూళ్లల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయిస్తూ ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం సెక్షన్ 12(1) అనుసరించి 2023-24 విద్యా సంవత్సరానికి జిల్లాలోని అన్ని ప్రయివేటు పాఠశాలల్లో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని డిఇఒ తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయివేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశానికి వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో http://cse.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 6 నుంచి 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థుల ఎంపిక రెండో జాబితా 16 నుంచి 22 వరకు ఉంటుందన్నారు. పాఠశాల ఎంపిక ఒకేసారి ఉంటుందని, తర్వాత మార్చుకునేందుకు వీలుండదని అన్నారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

6 నుంచి క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి- నౌపడ

నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 6 నుంచి బొంగు రాజారెడ్డి జ్ఞాపకార్థంగా మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, ఎఫ్‌సిసి సభ్యులు ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.20 వేలు నగదు, ట్రోఫీ, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, కప్పు అందజేస్తామని ప్రకటించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు రూ.1700 ఎంట్రీ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మేన్ ఆఫ్ ది సిరీస్‌లు అందజేస్తామని అన్నారు. ఆసక్తి గల జట్లు పోటీలో పాల్గొనేందుకు ఈ నెల ఆరవ తేదీ లోగా 7661073370, 7995801807, 9704981942 నంబర్లకు ఫోన్ చేసి వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

క్రైమ్ కార్నర్

చికిత్స అందజేస్తున్న వైద్యులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

వజ్రపుకొత్తూరు : మండలం సీతాపురానికి చెందిన కూసుమురు వెంకటరావు (51) మంగళవారం రాత్రి సమయంలో బెండి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుడు తాపీమేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. వజ్రపుకొత్తూరుకు తాపీ పని కోసం వచ్చి పని ముగించుకుని సాయంత్రం ఇంటికి బైక్‌పై వెళ్తున్నారు. పూండి నుంచి అతివేగంగా వచ్చిన మరో బైక్ దారుడు బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వెంకటరావు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

గాయపడిన వ్యక్తి మృతి

దేవరాజు గౌడ మృతదేహం

మెళియాపుట్టి : మండలంలో పూలసారి వద్ద గత నెల 30న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన టెక్కలికి చెందిన దేవరాజు గౌడ (49) మంగళవారం మృతి చెందారు. దేవరాజు గౌన్ తన బావమరిది కుమార్తె శుభకార్యానికి టెక్కలి నుంచి పూలసరికి బైక్‌పై వస్తున్నాడు. గ్రామ సమీపంలో కుక్కలు అడ్డు రావడంతో బైక్ బోల్తా పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడి భార్య దేవిగౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీంతో సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బాలికను కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తల్లిదండ్రులు సెల్‌ఫోన్ కొని ఇవ్వడం లేదనే కారణంతో నగరానికి చెందిన పదో తరగతి విద్యార్థి పొన్నాడ వద్ద ఉన్న నాగావళి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. అయితే స్థానికులు సమచారం మేరకు ఘటన స్థలానికి సకాలంలో చేరుకున్న వన్ టౌన్ హెడ్ కానిస్టేబుల్ బొమ్మాళి రవికుమార్ చాకచక్యంగా వ్యవహరించి బాలిక ప్రాణాలు కాపాడాడు. అయితే బాలిక ఆత్మహత్యాయత్నానికి ప్రధాన కారణం తల్లిదండ్రులు సెల్ ఫోన్ కొని ఇవ్వలేదని కారణంగా తెలుస్తోంది. విషయం తెలుసుకున్న హెడ్ కానిస్టేబుళ్ల సమయస్ఫూర్తిగా వ్యవహరించి బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి ఆత్మహత్య ప్రయత్నం విరమింపజేసి ప్రాణాలను రక్షించాడు. అనంతరం బాలిక తల్లిదండ్రులకు అప్పగించారు.

ఎస్‌పిని కలిసిన డిఎస్‌పి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిఎస్‌పి శృతి

జిల్లా ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి జి.ఆర్.రాధికను శ్రీకాకుళం డిఎస్‌పి వై.శృతి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ముందుగా డిఎస్‌పి కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలోని శాంతిభద్రతలపై చర్చించారు.

సోంపేట ఇఒగా వరప్రసాద్

వరప్రసాద్, ఇఒ

సోంపేట : సోంపేట మేజర్ పంచాయతీ ఇఒగా బి.వరప్రసాద్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో బారువా, జి.ఆర్.పురం లో పనిచేశారు. ఇప్పటి వరకు సోంపేట ఇన్‌ఛార్జి ఇఒ ఎ.వరలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. ఈయన రణస్థలం మండలం జె.ఆర్.పుర నుంచి డిప్యూటేషన్‌పై ఇక్కడకు వచ్చారు. ఆయనకు స్థానిక వార్డు మెంబర్లు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

నిరసన తెలుపుతున్న బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు

సంఘాల గుర్తింపును పునరుద్ధరించాలి

శ్రీకాకుళం అర్బన్ : పోస్టల్ ఉద్యోగ సంఘాల గుర్తింపును పునరుద్ధరించాలని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.గోవర్ధనరావు, పి.వెంకటరావులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉద్యమిస్తున్న పోస్టల్ ఉద్యోగులకు మదధతుగా ఆలిండియా బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన సంచా భవనం ఎదుట నల్లబాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. పోస్టల్ ఉద్యోగుల యూనియన్ గుర్తింపును తిరిగి పునరుద్దరించాలంటూ నినాదాలు చేశారు. 75 శాతం మంది ఉద్యోగులు గుర్తించి పోస్టల్ ఉద్యోగ సంఘాల గుర్తింపును రద్దు చేయడం తగదన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నుకున్న సంఘం గుర్తింపును రద్దు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఒ.ఎస్.అభిమన్యు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

పొందూరు: పొందూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి పి.ఎస్.వి.బి.కృష్ణసాయితేజ కోరారు. పొందూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పోలీస్ సిబ్బందితో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేసులకు సంబంధించిన కక్షిదారులకు కేసుల రాజీ వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని తెలిపారు.

ట్రిపుల్ ఐటిని సందర్శించిన 'నాక్'

ఎచ్చెర్ల : నాక్ గుర్తింపు ప్రక్రియలో భాగంగా విశ్వవిద్యాలయ స్థాయి నాక్ కమిటీ స్థానిక ట్రిపుల్ ఐటిని మంగళవారం సందర్శించింది. కమిటీలో గీతమ్ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ హరినారాయణ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ విసి కె.వియ్యన్నరావు, బెంగుళూరు ఐఎఎస్‌సి రిటైర్డ్ ప్రొఫెసర్ మోహనరావు సభ్యులుగా ఉన్నారు. ఒఎస్‌డి సుధాకర్‌బాబు అధ్యక్షతన కమిటీ నాక్ గుర్తింపునకు అవసరమైన సలహాలు, సూచనలు చేసింది. పలు విభాగాధిపతుల సమక్షంలో పరిశోధనలయాలు, గ్రంథాలయాలు ఇతర సదుపాయాలను పరిశీలించింది. కార్యక్రమంలో

సమీక్షిస్తున్న నాక్ కమిటీ సభ్యులు

పరిపాలన అధికారి మునిరామకృష్ణ, డీన్ కె.మోహన్‌కృష్ణ, ఎఫ్‌ఒ అసిరినాయుడు, గేదెల రవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు హైవేపై ట్రాఫిక్ ఆంక్షలు

శ్రీకాకుళం : ఈనెల మూడో తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విజయనగరం జిల్లా భోగాపురం పర్యటన నేపథ్యంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి ముఖ్యమంత్రి పర్యటన ముగిసే వరకు హైవేపై శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. అత్యవసర సేవలు, ప్రజా రవాణా వాహనాలకు మినహాయింపు ఉంటుందని తెలిపారు.

కక్షపూరితంగానే టిడిపి నాయకుల అరెస్టు

సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గొండు శంకర్

తూర్పుగోదావరి జిల్లాకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదిరెడ్డి అప్పారావు, వాసులను ప్రభుత్వ సిఐడి అరెస్టు కక్షపూరిత చర్య అని టిడిపి నాయకులు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ అన్నారు. ఈ మేరకు నగరంలోని విశాఖ-ఎ కాలనీలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రత్యర్థులను దెబ్బతీయడానికే జగన్ తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆదిరెడ్డి కుటుంబం మహానాడు పనులు చూస్తున్నందుకే వారిపై వైసిపి నాయకులు కక్ష కట్టారన్నారు. వారిని సిఐడి అదుపులోకి తీసుకోవడం జగన్ డైవర్షన్ డ్రామాలో భాగమని అన్నారు. ఫిర్యాదులు లేని కేసుల్లో టిడిపికి చెందిన బిసి నేతలైన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వాసులని అదుపులోకి తీసుకోవడం జగన్ కక్షపూరిత ధోరణికి నిదర్శనమన్నారు. వైసిపిలో చేరలేదనే అక్కసుతో ఇలాంటి అరెస్టులు చేయడం అమానుషమన్నారు. ఆదిరెడ్డి కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందన్నారు.

మాట్లాడుతున్న రవికుమార్

'లోకోస్' యాప్‌పై శిక్షణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆంధ్రప్రదేశ్‌తో పాటు భారతదేశంలోని మహిళా స్వయం శక్తి సంఘాల సమాచారం అంతటిని పొందుపరిచేందుకు, జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ద్వారా ప్రవేశపెట్టిన లోకోస్ యాప్‌పై సభ్యులందరికీ శిక్షణను ఇస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఏరియా కో-ఆర్డినేటర్ పి. రవికుమార్ తెలిపారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సిబ్బందితో మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యుల పూర్తి సమాచారాన్ని వారి ఆధార్ డేటా ఆధారంగా యాప్‌లో పొందుపరచాలన్నారు. పారదర్శకంగా ప్రతి మహిళా పొదుపు, రుణం, బీమా, వారు చేస్తున్న జీవనోపాధి, ప్రభుత్వం అందిస్తున్న వివిధ రాయితీలు, పథకాలు తదితర అన్ని అంశాలను ఒకే చోట లభ్యమైనట్లు జాతీయస్థాయిలో సమాచారాన్ని పొందుపరుస్తున్నట్లు వివరించారు. సిబ్బంది అందరికీ నాలుగు రోజుల పాటు శిక్షణ అనంతరం గ్రామస్థాయిలోని స్వయంశక్తి సంఘాల పొదుపులు, అప్పులు తదితర అంశాలన్నింటినీ కమ్యూనిటీ ఆడిట్ రిపోర్టులు ఆధారంగా ఇందులో పొందుపరచనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎపిఎం పైడి కూర్మారావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యమే ధ్యేయం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్లకు పాలక మండళ్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయాన్ని నెరవేర్చే విధంగా సిబ్బంది పనిచేయాలన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో పనిచేసే సిబ్బంది తప్పనిసరిగా పనివేళలు పాటించాలని చెప్పారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చినట్లు తెలిపారు. నగరంలో అత్యాధునిక వసతుల కల్పిస్తూ 67 రకాల పరీక్షలు నిర్వహించే విధంగా అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. వీటిని ప్రజలంతా వినియోగించుకోవాలని కోరారు. నిరుపేదలకు అందుబాటులో ఆధునిక వైద్యం అందించాలన్నది ధ్యేయమన్నారు. తన మంత్రి పదవి కన్నా క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది స్థాయే ఎక్కువని చెప్పారు. గతంలో ఒక్కో డాక్టర్ మూడు పిహెచ్‌సిలకు పనిచేయాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ బాధ తప్పిందన్నారు. తగినంత సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. అర్బన్ హెల్త్ సెంటర్లకు చైర్మన్లుగా నియమితులైన మొదలవలస రాజేంద్ర కుమార్ (డిసిసిబి కాలనీ), కల్లేపల్లి రామ్‌గోపాల్ (ఆదివారంపేట), ముద్దాడ అప్పలనాయుడు (అరసవల్లి), డి.పి దేవ్ (కాకివీధి), కిల్లంశెట్టి వెంకట అప్పారావు (పుణ్యపు వీధి), వెంకట సత్యరామరాజు (ఫాజుల్‌బాగ్‌పేట)తో ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత నగరానికి చెందిన 10 మంది వికలాంగులకు మంత్రి ధర్మాన స్కూటర్లను పంపిణీ చేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి పాల్గొన్నారు.

వికలాంగులకు ద్విచక్రవాహనాలు అందజేత

నగరానికి చెందిన 10 మంది వికలాంగులకు స్కూటర్లను మంత్రి ధర్మాన అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 80 మందికి వాహనాలను పంపిణీ చేయనున్నామని తెలిపారు. రూ.1.20 లక్షల విలువ గల ఒక్కో వాహనాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు.

మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

గృహ నిర్మాణాలు వేగవంతం

శాసనసభ స్పీకర్ తమ్మినేని

ప్రజాశక్తి- ఆమదాలవలస

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అధికారులను ఆదేశించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గృహ నిర్మాణాల ప్రగతిపై గృహనిర్మాణ శాఖ అధికారులు, నాలుగు మండలాల తహశీల్దార్లు, సర్వేయర్లతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలో 8,978 గృహాలు మంజూరై నిర్మాణంలో ఉండగా, కొత్తగా మరో మూడు వేల ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇప్పటివరకు ఎన్ని గృహ నిర్మాణాలు పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. లక్ష్యానికి అనుగుణంగా నిర్దేశించిన సమయానికి నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతిఒక్కరూ గృహాన్ని కలిగి ఉండాలన్నదే ముఖ్యమంత్రి అభిమతమన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించేటప్పుడు పక్కా గృహాల మంజూరుకు 1712 మంది తనకు వినతిపత్రాలను సమర్పించారని చెప్పారు. మూడు వేల అదనపు గృహాల మంజూరుకు ఉత్తర్వులు వెలువడ్డాయని, వీటన్నింటినీ సాధ్యమైనంత తొందరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని కోరారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసే నిమిత్తం ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని తహశీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో గృహనిర్మాణ సంస్థ పీడీ ఎన్.గణపతి, ఇఇ మోహనరావు, డిఇ చంద్రమౌళి, మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్, తహశీల్దార్లు ఎస్.గణపతి, ఎస్.రమణారావు, సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై టిడిపి సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాల నిర్మాణం టిడిపి హయాంలోనే జరిగిందని, ఈ నాలుగేళ్లలో మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చూపించాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల నూతన భవన నిర్మాణాల వద్ద మంగళవారం సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రెండు భవనాలూ 2017లో అప్పటి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కూన

ఇచ్ఛాపురం : సెల్ఫీ తీస్తున్న టిడిపి నాయకులు

రవికుమార్ నిధులను మంజూరు చేయించి పనులను ప్రారంభించారని అన్నారు. పొందూరులో ఈ నాలుగేళ్లలో మీరు నిధులు మంజూరు చేసి, నూతనంగా భవనం నిర్మాణం జరిపి ప్రారంభించినది ఏమైనా ఉందా? చెప్పాలని వైసిపి నాయకులను ప్రశ్నించారు. 2019లో అధికారంలోకి వచ్చిన మీ ప్రభుత్వం ఇప్పటికీ పూర్తిస్థాయిలో టిడిపి హయాంలో కట్టిన మండల పరిషత్ భవనానికి కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించలేదని అన్నారు. ఇప్పుడు మండల పరిషత్ భవనాన్ని మేము కట్టాం, మేము ప్రారంభిస్తున్నామని వైసిపి నాయకులు డబ్బా కొట్టుకుంటున్నారని పేర్కొన్నారు. పొందూరు అభివృద్ధిపై మీకు చిత్తశుద్ధి ఉంటే మీరు ఎక్కడెక్కడ భవనాలు కట్టారో, దేనికి బిల్లులు చెల్లించారో ప్రజలకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, మండల టిడిపి ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి నాయుడు, ప్రధాన కార్యదర్శి వండాన మురళి,

పొందూరు : ఎంపిడిఒ నూతన భవనం వద్ద సెల్ఫీ తీసుకున్న నాయకులు

పట్టణ అధ్యక్షులు అనకాపల్లి శ్రీరంగ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించడమే లక్ష్యంగా అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేశారని, అందులో భాగంగా ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో రూ.3.80 కోట్లతో నూతన సామాజిక ఆస్పత్రి భవనాన్ని నిర్మించి ప్రజలకు అంకితం చేశారని టిడిపి యువ నాయకులు కాళ్ల జయదేవ్, సంతోష్, జగదీష్, జన్నెల సంతోష్ సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. టిడిపి హయాంలో కట్టిన భవనాలకు రంగులేసుకోవడం దని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన ఈ నాలుగేళ్లలో పేదల కోసం ఒక్క కొత్త ప్రభుత్వాస్పత్రినైనా నిర్మించిందా? అని ప్రశ్నించారు.

మాట్లాడుతున్న చిన్నమ్మలు

ఖరీఫ్‌కు ప్రణాళికలు సిద్ధం చేయాలి

బూర్జ : మండలంలో వచ్చే ఖరీఫ్‌కు మహిళా సంఘాల ద్వారా రైతులకు ప్రకృతి వ్యవసాయ విత్తనాల కోసం సర్వే చేయాలని మాస్టార్ ట్రైనర్ చిన్నమ్మలు తెలిపారు. బూర్జలో మహిళా సంఘాల సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో మొత్తం 8 గ్రామాల్లో సంఘాల ఆధ్వర్యాన సర్వే నిర్వహిస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తూ.. ర్యాలీ నిర్వహించామని అన్నారు. ఖరీఫ్ పంటకు ప్రణాళిక రూపొందించి నవధాన్యాలు వేయడం వల్ల జీవ వైవిధ్యం పెరుగుతుందని అన్నారు. నేలలో కర్బన్ శాతం పెరుగుతుందని చెప్పారు. లక్ష్మి, జగన్, లావణ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వజ్రపుకొత్తూరు : ఇతరులకు సహాయం చేయడంలో ప్రతిఒక్కరూ ముందు ఉండాలని యువతరం సేవా సమితి అధ్యక్షుడు చింత మురళి అన్నారు. కొంత కాలంగా సికిల్ సెల్ అనీమియాతో బాధపడుతున్న కె.అశ్విన్‌కు ఆర్థిసాయం అందించారు. పలాసలోని అబ్బాయికి రూ.పది వేలు చెక్కును సంస్థ తరపున మంగళవారం అందజేశారు. తల్లికి అనారోగ్యాం కారణంగా దగ్గర బంధువు రూ.రెండు లక్షలు వరకు అప్పు చేసి వైద్యానికి ఖర్చు పెట్టారు. ఇంకా వైద్యుల ఖర్చుల కోసం డాక్టర్ చెప్పినా, డబ్బు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న యువతరం సేవా సమితి సభ్యులు వెళ్లి అబ్బాయి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తమ వంతు సహకారం అందించారు. కార్యక్రమంలో యువతరం కాశీబుగ్గ ఇన్‌ఛార్జి అన్నెపు లక్ష్మణరావు, ఇన్‌ఛార్జి గోరకల సునీల్, కర్ని రేవతి, వెంకట్, శ్రీదేవి, అమృత తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న మురళి

డిఎలు చెల్లించాలి

టెక్కలి : విశ్రాంత ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు కరువుభత్యం మంజూరు చేస్తూ... ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, కానీ, ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టం చేయకపోవడం విచారకరమని ఎపిటిఎఫ్ మండల శాఖ గౌరవ అధ్యక్షులు గున్న ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. కరువు భత్యం చెల్లింపు ఉత్తర్వుల్లో రాసిన ప్రకారం ఉద్యోగ విరమణ చేసిన వారికి ఇంతవరకు చెల్లించలేదని అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వమే ఉల్లంఘన చేయడం విచారకరమన్నారు. డిఎ చెల్లింపులో ప్రభుత్వం అనుసరిస్తున్న అస్తవ్యస్త విధానాల వల్ల ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ విరమణ చేసిన వారికి రావాల్సిన బకాయిలను సత్వరమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

నీటిని సరఫరా చేస్తున్న గోపి

తాగునీరు సరఫరా

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నీటిఎద్దడి తీవ్రంగా ఉందని, తాగునీరు కోసం పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నీటిఎద్దడి ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని మున్సిపల్ 19 వార్డు కౌన్సిలర్ ప్రతినిధి శిష్ట గోపి చెప్పారు. కాశీబుగ్గ సూదికొండ కాలనీలో మంగళవారం కాలనీ వాసులకు ట్యాంకర్ల నీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తలెత్తకుండా రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ముందస్తు చర్యలు తీసుకొని ప్రతి వార్డులోనూ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశామని తెలిపారు.

జగన్‌తోనే సంక్షేమం సాధ్యం

బూర్జ : పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- బూర్జ

భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుస్థిరంగా, సుభిక్షంగా ఉంచే శక్తి సిఎం జగన్మోహన్‌రెడ్డికే మాత్రమే ఉందని శాసనసభ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని గుత్తావల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై వివరించారు. ఇందులో భాగంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఎవరైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే గ్రామ సచివాలయాలను సంప్రదించాలని సూచించారు. నాలుగేళ్లలో మండలంలోని ప్రతి గ్రామంలోనూ జరిగిన అభివృద్ధిని ప్రజానీకం ముందు ఉంచేందుకు ఈ కార్యక్రమం దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కర్నెన నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు, అవుట్ సోర్సింగ్ రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు, కర్ణం కృష్ణంనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుమ్మడి రాంబాబు, ఇసాయి వెంకటరావు, బొడ్డేపల్లి నాగరాజు, బొడ్డేపల్లి నారాయణమూర్తి పాల్గొన్నారు.

అవ్వా... బాగున్నావా

కోటబొమ్మాళి: మండుటెండలో ప్రజలతో మమేకమై ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతున్న తీరును తెలుపుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రతి ఒక్కరినీ కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. మండలంలోని కిట్టుపురం పంచాయతీ బలరాంపురం, కన్నేవలస పంచాయతీ చుట్టుగుండం గ్రామాల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌ఛార్జి గడ్డవలస నాగభూషణరావు, వైసిపి మండల అధ్యక్షులు నూక సత్యరాజు, సర్పంచ్‌లు బొడ్డు వెంకటరమణ, నేతింటి చిన్నమ్మడు, అప్పలస్వామి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

బొబ్బిలిపేటలో బోరు ఏర్పాటు

ఆమదాలవలస : మండలంలోని బొబ్బిలిపేటలో రామాలయం వద్ద ఉన్న తాగునీటి బోరు మూడు నెలలుగా మరమ్మతులకు గురైంది. దీంతో నీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన సర్పంచ్ గొండు రమణ మంగళవారం సిబ్బందితో నూతన పైపులు, చైన్ తదితర నూతన సామగ్రిని వేయించి బోరును వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామంలోని ప్రజలు తాగునీటి కోసం ఎటువంటి ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. అలాగే గ్రామంలో పలు వీధుల్లోని తాగునీటి కుళాయిలు కొద్దికాలం కిందట పాడైపోయి మంచి నీరు రాకపోవడంతో వాటిని కూడా దగ్గరుండి మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో వార్డు మెంబరు చింతాడ అప్పారావు, కార్యదర్శి బి.పూర్ణిమ పాల్గొన్నారు.

మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రమణ

కిడ్నీ బాధితులపై ప్రత్యేక శ్రద్ధ

కవిటి: కిడ్నీ బాధితులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని కుసుంపురం సర్పంచ్ ప్రతినిధి శివ బిసాయి అన్నారు. కుసుంపురానికి చెందిన అర్జి ఆదిలక్ష్మికి డయాలసిస్ పింఛను రూ.10 వేలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా శివ బిసాయి మాట్లాడుతూ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారికి ప్రభుత్వం అందిస్తున్న పింఛను ఎంతో ఉపయోగపడుతోందని, ముఖ్యంగా డయాలసిస్ రోగులకు ఈ పింఛను ఆపదలో ఆదుకుంటోందని అన్నారు. అలాగే పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పనులు పూర్తయితే ఉద్దానం ప్రాంతంలోని కిడ్నీ బాధితులకు ఊరట లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి కె.సత్యం, కన్వీనర్ ఎన్.శ్రీనివాస్, వెల్‌ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, వాలంటీర్ పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలు బలోపేతం

పలాస : మాట్లాడుతున్న రామ్మోహనరావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

డ్వాక్రా సంఘాల్లో శత శాతం గ్రేడింగ్ మొదటి స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్ చేయూత డిఆర్‌డిఎ ప్రాజెక్టు మేనేజర్ సిహెచ్.రామ్మోహనరావు సూచించారు. మండలంలో జరుగుతున్న లోకోస్ యాప్ రెండో రోజు శిక్షణా కార్యక్రమంలో పరిశీలకులుగా మంగళ వారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్ఛాపురం మండలం జిల్లాలోనే ఆదర్శ మండలమని, జరుగుతున్న అన్ని కార్యక్రమాలూ శతశాతం పూర్తి చేయడంలో సిబ్బంది బాగా పనిచేస్తున్నారని అన్నారు. వైఎస్ఆర్ చేయూత ద్వారా మూడు విడత నిధులు రూ.18,750 పొంది వివిధ కిరాణా, పశువులు పెంపకం, పెరటి కోళ్ల పెంపకం, మత్స్య కార్యక్రమాలు ఇతర ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆదాయం సంపాదిస్తున్న మహిళల సేల్స్ ప్రగతి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం ప్రసాదరావు, సిసిలు ఎ.రామకృష్ణ, డి.మోహన రావు, విష్ణుబాబు, మోహిని పాల్గొన్నారు.

పలాస: గ్రామాల్లో డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలని, అందుకు ఐకెపి సిఎఫ్‌లు, సిసిలు కృషి చేయాలని వైఎస్ఆర్ చేయూత డిపిఎం సిహెచ్.రామ్మోహనరావు సూచించారు. కాశీబుగ్గ స్త్రీ నిధి భవనంలో వెలుగు ఆధ్వర్యాన జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్‌పై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 1096 సంఘాలు ఉండగా, 12,356 సభ్యులు ఉన్నారని చెప్పారు. వీరిని లోకోస్ వ్యాప్‌లో అప్ లోడింగ్ చేయాలన్నారు. దీనిద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన ఆర్థిక సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎపిఎం మల్లేశ్వరరావు, ఇఒ డ్వాక్రా అప్పల నర్సమ్మ, సిసిలు వెంకటేశ్వరరావు, నాగమ్మ, రేణుక పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

మాట్లాడుతున్న ఎస్ఐ గణేష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆరోగ్యమే ప్రతి మనిషికీ ఐశ్వర్యమని వన్ టౌన్ ఎస్ఐ బి.గణేష్ అన్నారు. మారుతీవాకర్స్ క్లబ్, కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన నగరంలోని విశాఖ-బి కాలనీ షిర్డీ సాయిబాబా మందిరంలో పిఎంకె యోగా క్లబ్ వేసవి శిక్షణా శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏ పని చేయడానికైనా సాధ్యపడుతుందని అన్నారు. ఆరోగ్యంగా ఉండడానికి యోగా ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో బాబా మందిర కమిటీ చైర్మన్ డాక్టర్ మధుకర్ విలేకర్, వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్, కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొంక్యాన మురళీధర్, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, యోగా గురువులు రామారావు, నాగేశ్వరరావు, పి.మురళీకృష్ణ, వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్-1 కూన వెంకటరమణ, మారుతీ వాకర్స్ క్లబ్ కార్యదర్శి పొట్నూరు నాగేశ్వరరావు, కొంక్యాన మంగమ్మ పాల్గొన్నారు.

సీలింగ్ ఫ్యాన్లు వితరణ

పలాస : పలాస ప్రభుత్వాస్పత్రిలో వేసవి దృశ్య రోగులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నా వంతుగా రోగులకు ఏదో సహాయం చేయాలనే ఉద్దేశంతో కాశీబుగ్గకు చెందిన పెంట శివానందం ఐదు సీలింగ్ ఫ్యాన్లు మంగళవారం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవానీశంకర్, మున్సిపల్ కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మేఘన, డాక్టర్ అశ్విని, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ కూర్మారావు, డాక్టర్ గీతారాణి, హెడ్‌నర్స్ ఇందుమతి, కౌన్సిలర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఫ్యాన్లు అందజేస్తున్న శివానందం

సెలవుల్లో తరగతులు వద్దు

టెక్కలి : ప్రభుత్వ విద్యాశాఖ ప్రకటించిన మేరకు ప్రయివేటు పాఠశాలలు వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించవద్దని టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ ఒక ప్రకటనలో సూచించారు. ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు ముందస్తు ప్రవేశాల నిమిత్తం పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ప్రయివేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తప్పవన్నారు.

గ్రంథాలయానికి కంప్యూటర్ వితరణ

పలాస : మండలంలోని నీలావతిలో ఉద్దాన విద్యా అభివృద్ధి వేదిక ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి కాశీబుగ్గ గురుకుల విద్యాలయం పాఠశాల కరస్పాండెంట్ కింతల అశోక్‌కుమార్ కంప్యూటర్ వితరణగా మంగళవారం అందజేశారు. గ్రంథాలయంలో నిరుద్యోగులు, విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు వీలుగా ఉంటుందనే ఉద్దేశంతో కంప్యూటర్ వితరణ చేశారు. కార్యక్రమంలో అకాడమిక్ సెల్ కన్వీనర్ పి.బాలరాజు, సభ్యులు పి.శేషగిరిరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

విశ్వనాథం ఆశయాలను కొనసాగిద్దాం

వజ్రపుకొత్తూరు: మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం ఆశయాలను కొనసాగిద్దామని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గోవిందపురం సచివాలయంలో సర్పంచ్ ప్రతినిధి పాలిన ఉమామహేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వనాథం వైద్యుడిగా, విద్యావేత్తగా మన ప్రాంతానికి ఎన్నో సేవలు అందించారని అన్నారు. రెండు పర్యాయాలు ఎంపీగా పనిచేసి సేవలందించారని గుర్తు చేశారు. గోవిందపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు ఆయన ఎంతో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కణితి వెంకట భగవాన్, కారువాడు గంగాధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

వైభవంగా సంగీత ఉత్సవాలు

కవిటి: స్థానిక పట్టాభిరామయ్య కళాపీఠం ఆధ్వర్యాన వైశాఖమాస సంగీత ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తు న్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం రాత్రి నిర్వహించిన గాత్ర కచేరి ఆహుతులను అలరించింది. కార్యక్రమంలో పట్టాభిరామ పండిట్ గాత్రంతో నీలాద్రిరావు వయోలిన్, బి.వి.ఎస్.ప్రసాదరావు మృదంగం, కె.వి.రామకృష్ణ ఘటంతో ప్రేక్షకులను అలరించారు. బెందాలం కామరాజు, నారాయణమూర్తి సోదరుల ఆధ్వర్యాన ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

జూడో శిక్షణా తరగతులు ప్రారంభం

పొందూరు: మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి జూడో శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు పైడి సునీత తెలిపారు. నెల రోజుల పాటు రోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు స్వర్ణోత్సవ కళావేదికలో ఈ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరూ ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. శిక్షణా తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు పూర్వ విద్యార్థులు, దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మెట్ట అనంతభట్లు పాల్గొన్నారు.

పాల్గొన్న విద్యార్థులు